క్లుప్తంగా

హాస్టల్‌కు భారీ విరాళం



నాదెండ్ల: పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో దాతలు ముందుకు రావాలని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. గుంటూరు నగరంపాలెంలోని రెడ్డి హాస్టల్‌లో అదనపు గది నిర్మాణానికి మంగళవారం రామిరెడ్డి రూ.8 లక్షలు విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా హాస్టల్ కమిటీ సభ్యులు ఆయన్ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో హాస్టల్ అధ్యక్షుడు అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, కార్యదర్శి సంజీవరెడ్డి, సభ్యులు వీసీఆర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్టు



చిలకలూరిపేట టౌన్: గంజాయి విక్రయదారులను ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని జాగుపాలెం, కొత్త ఓగేరు వాగు బ్రిడ్జి వద్ద గంజాయి సేవిస్తున్న, విక్రయిస్తున్న దాసరి పవన్‌సాయి, కటికల సింగయ్య, వేముల దుర్గాప్రసాద్ అనే ముగ్గురు యువకులను సోమవారం రాత్రి సీఐ పి.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ పి.హజరత్తయ్య సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. వీరివద్ద నుంచి సుమారు అరకిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మంగళవారం కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి వంటి మాదకద్రవ్యాల విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

నాదెండ్ల డీటీగా షేక్ సల్మాన్

నాదెండ్ల: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా షేక్ సల్మాన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ఇక్కడకు బదిలీపై వచ్చారు. విధుల్లో చేరిన సల్మాన్‌ను తహసీల్దార్ చంద్రశేఖర్, కార్యాలయ సిబ్బంది, నాయకులు అభినందించారు.

పెన్షనర్ల కమిటీ ఎన్నిక



నాదెండ్ల: గణపవరం టీఆర్‌కే ప్రభుత్వ పెన్షన్ దారుల భవనంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి రిటైర్డ్ లెక్చరర్ చంద్రశేఖరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన పెన్షనర్ల కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా వై భాస్కరరావు, ఉపాధ్యక్షుడిగా టి.హైమావతి, కార్యదర్శిగా కాట్రు కృష్ణారావు, ఉప కార్యదర్శిగా శివరామకృష్ణ, కోశాధికారిగా కోలా కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా వడ్లమూడి చిన్నబ్బాయి, ఎం.చంద్రశేఖర్ ఎంపికయ్యారు. వీరు రెండేళ్ళ పాటూ కమిటీలో కొనసాగనున్నారు. నూతనంగా ఎంపికైన సభ్యుల ను మాజీ అధ్యక్షుడు తొండెపు రాధాకృష్ణ, పలువురు రిటైర్డ్ ఉద్యోగులు అభినందించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నరసరావుపేట రూరల్: పట్టణం నుంచి వినుకొండకు వెళ్లే మార్గంలో పొలాల్లో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ వెల్లడించారు. మృతుడు బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం మిన్నెకల్లు గ్రామానికి చెందిన తాడికొండ శ్రీను (28)గా గుర్తించామన్నారు. గతంలో నరసరావుపేటలోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేశాడని, మద్యానికి బానిసై ఆ ఉద్యోగాన్ని పోగొట్టుకొని తన స్వగ్రామం చేరాడన్నారు. అయితే మద్యంకు బానిసైన శ్రీను తన పరిస్థితికి చింతిస్తూ మద్యంలో పురుగు మందును కలుపుకొని సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ప్రాథమికంగా నిర్ధారించామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్
- సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలంటూ పిలుపు



మాట్లాడుతున్న ఆంజనేయులు నాయక్

నరసరావుపేట: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక వర్గానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటోందని, పరిమితులు లేని 14 నుంచి 20 గంటల పనివిధానానికి వ్యతిరేకంగా కార్మికవర్గం అనేక పోరాటాలు చేసి సాధించుకున్న ఎనిమిది గంటల పనివిధానాన్ని కార్మిక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ అన్నారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో సార్వత్రిక సమ్మె జయప్రదంకై ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు నిర్మల అధ్యక్షత వహించారు. ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై నరేంద్ర మోదీ అవలంభిస్తున్న ఆర్థిక విధానాలను వ్యతిరేకిస్తూ ఉద్యోగ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ పనిగంటల పెంపు విధానం అమలుచేయాలని నిర్ణయించడం సిగ్గుచేటని, రాత్రి సమయంలో మహిళలతో పని చేయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను కాలరాసే విధంగా పని గంటలను పెంచుతూ కూటమి ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పనివిధానాన్ని అవహేళన చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్మికవర్గానికి తీరని ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా కోశాధికారి డి.శివకుమారి మాట్లాడుతూ కార్మికులకు పనిఒత్తిడి పెరిగిందని, రాష్ట్రంలో నిరుద్యోగం తాండవిస్తోందన్నారు. ప్రభుత్వరంగంలో ఖాళీగా ఉన్న లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. పనిగంటల పెంపు విధానానికి వ్యతిరేకంగా నిరుద్యోగులు కార్మికులతో కలిసి పోరాటం చేయాలన్నారు. రాష్ట్రంలో 15 ఏళ్ల నుంచి వేతనాలు పెరగలేదని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగక కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు. లేబర్ కోడ్ లు నిలుపు చేయకపోతే మోదీ ప్రభుత్వం కార్మికవర్గ ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని కూటమి నేతలను హెచ్చరించారు. మండల నాయకులు షేక్ సిలార్ మసూద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జీవ రత్నం, విజయలక్ష్మి, సోమశేఖర్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కొమ్ముల సురేష్, కోటిరెడ్డి, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

చీడపీడల నివారణకు తొలి అస్త్రం విత్తనశుద్ధి

- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నగేష్
- జాలాది గ్రామంలో పొలం పిలుస్తోంది నిర్వహణ



రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

యడ్లపాడు: మండలంలోని జాలాది గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం.నగేష్, యడ్లపాడు వ్యవసాయ అధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు. గ్రామ పరిధిలో ఖరీఫ్‌లో సాగయ్యే ప్రధాన పంటల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ముఖ్యంగా మొక్కజొన్న, శనగ, కంది పంటలకు సంబంధించి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. మొక్కజొన్న పంటను ఆశించే కత్తెర పురుగు నివారణకు కిలో విత్తనాలకు పార్టేన్జాడియో మందును 600మిలీ చొప్పున తీసుకుని విత్తనశుద్ధి చేసుకుని విత్తుకుంటే, తొలి 25 రోజుల వరకు కత్తెరపురుగు బెడద ఉండదని తెలిపారు. పత్తిలో అధిక సాంద్రత పద్ధతిని అనుసరించి సాగు చేస్తే 150 రోజుల్లోపు 25శాతం ఎక్కువ దిగుబడులను పొందవచ్చని డాక్టర్ నగేష్ వివరించారు. అయితే ఈ పద్ధతిలో సాళ్ల మధ్య 2.5 అడుగుల దూరం, మొక్కల మధ్య 8 అంగుళాల దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే చమత్కార్ అనే మందును ఎకరానికి 160 ఎంఎల్ చొప్పున విత్తిన 40, 60, 80 రోజులకు పిచికారీ చేయాలని సూచించారు. శనగలో ఎంబీఈజీ-776 రకాన్ని సాగు చేయడం ద్వారా యంత్ర కోతకు అనుకూలంగా ఉండటమే కాకుండా, అధిక దిగుబడిని సాధించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఇలా అధునాతన వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన పెంపొందించుకుని, తద్వారా అధిక లాభాలు పొందాలని వ్యవసాయ అధికారులు ఆకాంక్షించారు.

వేర్వేరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

వినుకొండ : మండలంలోని ఉప్పరపాలెం, చాట్రగడ్డపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జి.వరలక్ష్మి మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్టెవ ఇత్తనాలు భూమిలో వేసి పూత దశ వరకు ఉంచి భూమిలో కలియదున్నాలని, తద్వారా సేంద్రియ కర్బనం పెరిగి భూమిలో సూక్ష్మజీవులు వృద్ధిచెంది భూమి గుల్ల బారేటట్లు చేయునని, సారవంతమవుతుందని, వివిధ రకాల పోషకాలు, విటమిన్లు మొక్కలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన జిల్లా మేనేజర్ లింగయ్య, నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఆర్ఎస్కే సిబ్బంది ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలి

- ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి సిలార్ అహ్మద్
- నల్ల బ్యాడ్జీలు ధరించి నాయకులు, కార్మికులు నిరసన ప్రదర్శన



కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన చేస్తున్న నాయకులు, కార్మికులు

నరసరావుపేట: ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికుల జీతాలు పెంచుతామని చేసిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంపాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి సిలార్ అహ్మద్ డిమాండ్ చేశారు. మంగళవారం తమ డిమాండ్ల సాధనకోసం ఇంజినీరింగ్ కార్మికులు పట్టణంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా సిలార్ మాట్లాడుతూ ఏడాది గడిచినా చేసిన వాగ్దానం నిలబెట్టుకోలేదని అన్నారు.

గత సమ్మెకాలంలో ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని కోరారు. గత 11 ఏళ్లుగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు అవే జీతాలతో పనిచేస్తున్నారని, కష్టమైన పనులు సైతం చేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వానికి కనికరంలేదని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం గత నెల ఆరున సమ్మె నోటీసు ఇచ్చినా కార్మిక నాయకులతో చర్చలు చేయలేదన్నారు. సమ్మెను నివారించాలన్నదే తమ విధానమని, అయితే ప్రభుత్వం మాత్రం అందుకు నిర్ణయం తీసుకోవట్లేదన్నారు. ఈనెల నాల్గవ తేదీన సమ్మె చేసేందుకు మున్సిపల్ కార్మికులు అందరూ సిద్ధంగా ఉండాలని, ఛలో విజయవాడకు తరలి రావాలని పిలుపు ఇచ్చారు. అల్లాభక్షు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



వినుకొండ: ఫెన్సింగ్ అండర్ -10 జాతీయ స్థాయి పోటీలకు పట్టణంలోని నిర్మలా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న పిల్లి రుత్విక్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం బెనడిక్ తెలిపారు. ఇటీవల విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన 6వ రాష్ట్ర స్థాయి అండర్ 10 పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు వివరించారు. త్వరలో మహారాష్ట్రలో జరగబోయే జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.

వృద్ధులకు బియ్యం, పండ్లు పంపిణీ



వినుకొండ: పట్టణంలోని గుమ్మడి వృద్ధాశ్రమాన్ని ఈటీవీ పాడుతా తీయగా ఆర్కెస్ట్రా బృందంలోని సభ్యులైన ప్యాడ్ ప్లేయర్ సీహెచ్. విజయరాజు, ప్రముఖ ప్లే బ్యాక్ సింగర్ లావణ్య సందర్శించారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బియ్యం, పండ్లు అందించారు. అనంతరం పంచాయతీ సెక్రటరీగా సేవలందించి విరమణ పొందిన టి. సూరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుమ్మడి వెంకటేశ్వర్లు, భీమవరపు ఏడుకొండలు, రావిపాటి వీరయ్య, పారెళ్ల ప్రసాద్, దాసరి నాగేశ్వరరావు, దొండపాడు బ్రహ్మయ్య, గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగుండ్ల సేవలు అభినందనీయం

జెడ్పీటీసీ సభ్యురాలు హైమావతి



వెంకటేశ్వరస్వామి దంపతులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

శావల్యాపురం: పంచాయతీ రాజ్ వ్యవస్థలో 42 సంవత్సరాల పాటు మెరుగైన సేవలు అందించిన ఏఈ కొత్తగుండ్ల వెంకటేశ్వర స్వామి సేవలు అభినందనీయమని జెడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పదవీ విరమణ చేసిన ఏఈ వెంకటేశ్వరస్వామి వీడ్కోల సభ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు పారదర్శకంగా నిర్వహించి అందరి మన్ననలు పొందటం పలువురికి ఆదర్శమన్నారు. అంకిత భావంతో విధులు నిర్వహించిన ఉద్యోగులు ప్రజల నుంచి ఆదరణ పొందుతారన్నారు. అనంతరం వెంకటేశ్వర స్వామి దంపతులను పూలమాలలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, పంచాయతీ రాజ్ డీఈ గంగానాయక్, ముత్తయ్య, ఈవోపీఆర్ పి.సుగుణ, వైస్ ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు, రొంపిచర్ల మండలం ఎంపీడీవో మాధ్యుబాబు, మాజీ ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శేష జీవితం ఆనందంగా గడపండి

- జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- పదవీ విరమణ చేసిన పలువురు పోలీసు, హోంగార్డులకు సన్మానం



సన్మానం పొందిన వారితో జిల్లా ఎస్పీ, అధికారులు

నరసరావుపేట: ఉద్యోగ విరమణ అనేది కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆనందంతో శేష జీవితం గడిపేందుకు వచ్చిన అవకాశంగా భావించాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లాలోని పోలీసు విభాగంలో విశేష సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన పలువురు అధికారులు, హోంగార్డులను సోమ, మంగళవారాల్లో జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఉద్యోగ విరమణ పొంది సన్మానం పొందిన వారిలో నరసరావుపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ కె.ఆదినారాయణ, నాదెండ్ల పోలీసుస్టేషన్, నరసరావుపేట రూరల్ పోలీసుస్టేషన్ ఏఎస్ఐలు ఎస్.కొండయ్య, సీహెచ్.శ్రీనివాసరావు, రాజుపాలెం, సత్తెనపల్లి పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుళ్లు సీహెచ్.నరసింహారావు, ఐ.రవి, డీపీఓ డి.నాగమల్లేశ్వరరావు, జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ హోంగార్డు, కమ్యూనికేషన్ హోంగార్డు షేక్ అల్లాభక్షు, డి.గాలయ్యలు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఎదుర్కోవలసిన ఘట్టమన్నారు. ఇప్పటి వరకు ఇన్ని రోజులు ప్రజలకు సేవ చేయుటంలో తనమునకలై అహర్నిశలు శ్రమించి, ఒక్కసారిగా ఉద్యోగ విరమణ పొందటం కొంచెం బాధ కలిగిస్తుందన్నారు. మిగిలిన జీవితం మన కోసం మనం గడపడానికి వచ్చిన అవకాశంగా భావించి కుటుంబం, బంధుమిత్రులతో కలిసి సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలియచేశారు. పోలీస్‌శాఖలో ఇన్ని రోజులు సేవలందించేందుకు వారికి సహకరించిన కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

అదనపు ఏఆర్ ఎస్పీ సత్తిరాజు, ఏఆర్ డీఎస్పీ గాంధీరెడ్డి, డీసీఆర్‌బీ సీఐ ఎం.శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్, హోంగార్డు ఆర్ఐ కృష్ణ, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు టి.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్డురాయి వార్షికోత్సవం

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ సీతారామాంబ తల్లి (బొడ్డురాయి) 15వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ఉదయం జలాభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. పూజారి కన్నా ఆధ్వర్యంలో కుంకుమ, ఆకు పూజలు నిర్వహించారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ షేక్ రాఫానీ, నాయకులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అతిథులను ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా ఆహ్వానించి తీర్థప్రసాదాలు అందించారు. భక్తులకు అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

పంటల బీమా సద్వినియోగం చేసుకోండి

రొంపిచర్ల: మండలంలోని రైతులందరూ పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శివలలిత అన్నారు. 2025వ సంవత్సరం ఖరీఫ్‌లో సాగు అయ్యే వరి, కంది, ఎర్రమిరప పంటలకు బీమా సౌకర్యం కల్పిస్తున్నామని సంతగుడిపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన రైతుల సమావేశంలో తెలిపారు. వరి పంటకు ఎకరాకు రూ.80లు, కంది పంటకు రూ.40లు, ఎర్రమిరప పంటకు రూ.360లు ప్రీమియంగా చెల్లిస్తే సరిపోతుందన్నారు. అలాగే కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులను వినియోగించుకోవాలని సూచించారు. వరి రైతులకు జేజీఎల్ 384 రకానికి ప్రత్యామ్నాయంగా కెఎస్ఎం 1638 రకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు



చెక్కులు అందజేస్తున్న ఎస్‌బీఐ బ్యాంకు మేనేజరు ప్రసాదు

శావల్యాపురం: ఎస్‌బీఐ బ్యాంకు వారి సారథ్యంలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేయటం అభినందనీయమని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో 8, 6, 10 తరగతుల్లో విద్యలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు ఆరుమందికి నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఎస్‌బీఐ శావల్యాపురం బ్యాంకు మేనేజరు వలేటి ప్రసాదు మాట్లాడుతూ ఎస్‌బీఐ బ్యాంకు 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సందర్భంగా బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు నగదు ప్రోత్సాహక బహుమతులను చెక్కులు రూపంలో అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు నగదు అధికారి శ్రీహరి, దాసరి ప్రకాష్, ఈస్తేరీరాణి, రామకృష్ణ, ఉపాధ్యాయులు సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

5న క్యాంటిన్ నిర్వహణ వేలం

నరసరావుపేటటౌన్: న్యాయస్థాన భవనాల ఆవరణలోని క్యాంటిన్ నిర్వహణకు ఈనెల 5న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు న్యాయవాద సంఘ అధ్యక్షుడు సుబ్బారావు మంగళవారం తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు నరసరావుపేట కోర్ట్ ఆవరణలో వేల నిర్వహిస్తామన్నారు. న్యాయవాద సంఘ షరతులు మేరకు క్యాంటిన్ నిర్వహించుకోవలసి ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది

- రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం అధ్యక్షుడు బోనం వెంకటేశ్వరరావు
- వేర్వేరు ప్రాంతాల్లో డాక్టర్స్ డే



చిలకలూరిపేటలో డాక్టర్ కొల్లా అమర్‌ను సన్మానిస్తున్న సభ్యులు



రొంపిచర్లలో మాట్లాడుతున్న హెల్త్ సూపర్ వైజర్ సురేష్

చిలకలూరిపేట: వైద్యవృత్తి ఎంతో పవిత్రమైందని, వైద్యులను గౌరవించుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం అధ్యక్షుడు బోనం వెంకటేశ్వరరావు చెప్పారు. అంతర్జాతీయ డాక్టర్స్‌డే ను పురస్కరించుకొని క్లబ్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కొల్లా అమర్, డాక్టర్ పిన్నింటి సాహితి, డాక్టర్ లింగా అప్పారావు తదితరులను మంగళవారం సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వైద్య చికిత్సల ద్వారా ప్రాణాలను కాపాడే వైద్యులను సన్మానించుకోవడం గర్వకారణమని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి దోరడ్ల శివనాగ మనోజ్ కుమార్, రాజు, సింగారావు, దాసునాయన తదితరులు పాల్గొన్నారు. సెంట్రల్ బ్యాంక్ సిబ్బంది ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే ను పురస్కరించుకొని గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణులు డాక్టర్ ముప్పాళ్ల బలరామకృష్ణ తేజస్వి, డాక్టర్ ముప్పాళ్ల హనుమంతరావులను ఘనంగా సన్మానించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల : మండలంలో వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం 'డాక్టర్ డే' దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు డాక్టర్ రేవతిభాయి, డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, డాక్టర్ సాయి బాబులను వైద్యసిబ్బంది ఘనంగా సన్మానించారు. వైద్యులుగా ప్రజలకు వారు చేస్తున్న వైద్యసేవలను కొనియాడారు. వైద్య వృత్తి పవిత్రమైనదన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



సమ్మెను జయప్రదం చేయాలని కోరుతున్న నాయకులు

నరసరావుపేట ఈస్ట్: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జులై 9వతేదిన తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ పల్నాడుజిల్లా కార్యదర్శి కాసా రాంబాబు తెలిపారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం సత్తెనపల్లిరోడ్డులోని ఆయిల్ మిల్లుల కార్మికులకు సమ్మె నోటీసు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తు కార్మిక హక్కులను హరించి వేస్తున్న దని తెలిపారు. దేశ సంపదను అంబానీ, అదానీలను దోచిపెడుతున్నారని విమర్శించారు. ఏఐటీయూసీ నాయకులు రంగయ్య, సత్యనారాయణరాజు, ఆర్.అంజిరెడ్డి, సి.హెచ్.నాగేశ్వరరావు, తోట నరసింహారావు, సిపిఐ నాయకులు షేక్.చినజాన్ సైదా పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని అభినందిస్తున్న నరసరావుపేట మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు -నరసరావుపేట